నమస్తే తెలంగాణ
# ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్ ఆదివారం 7 ఏప్రిల్ 2024 | ADILABAD NIRMAL

## కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెబుతాం..



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ మంత్రులకు ఎద్దు, ఎవుసం తెల్వదు. రైతు సమస్యలపై వారికి ఏ మాత్రం అవగాహన లేదు. కాళేశ్వరం ప్రాజెక్టును పట్టుకుని బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బదనాం చేయడం తప్పా.. పంటలకు నీరు అందించలేని పరిస్థితి. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలతో రైతులు పంటలు నష్టపోయినా ప్రభుత్వంలో స్పందన లేదు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదు. బీఆర్ఎస్ పాలనలో వ్యవసాయం ఎట్లుంటే ఇప్పుడు ఎట్ల అయింది. రైతుల గోస పుచ్చుకుంటున్న ప్రభుత్వం ఎక్కువ కాలం నిల్వదు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతాం.

**- హన్మండ్లు, రైతు, గిమ్మ, జైనథ్ మండలం**

## కేసీఆర్ పాలన బాగుండే..



కేసీఆర్ పాలన బాగుండే. కాంగ్రెస్ నాయకుల మాటలు విని మంచి ప్రభుత్వాన్ని పోగొట్టుకున్నం. పదేండ్లుగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు అవుతున్నా రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నేరవేర్చలేదు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తదనే నమ్మకం లేదు. నాకు ఆరు ఎకరాల భూమి ఉంది. రైతుబంధు పైసలు రాలేదు. రూ.2 లక్షల రుణమాఫీకి దిక్కులేదు. కరెంటు సమస్యలు వస్తున్నా పట్టించుకోవడం లేదు. కష్టపడి పండించిన పంటలను కొనేవారు లేక వ్యాపారులకు అమ్మి నష్టపోతున్నాం.

**- ధూమల శివ్వన్న, రైతు, జైనథ్ మండలం**

# కదంతొక్కిన రైతన్న

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బీఆర్ఎస్ రైతు దీక్షలు
- ఎండిన పంటలకు రూ.25 వేల పరిహారం, ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలి
- మారుమూల పల్లెల నుంచి వచ్చి మద్దతు తెలిపిన అన్నదాతలు
- అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో జరిగిన నిరసన కార్యక్రమం

## హామీలు నెరవేర్చాల్సిందే..

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు వెంటపడుతామని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని విశ్రాంతి భవనం ఎదుట నిర్వహించిన రైతుదీక్షకు ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలకు చెందిన రైతులు భారీ సంఖ్యలో హాజరైన రైతులనుద్దేశించి రామన్న మాట్లాడుతూ.. కాంగ్రెస్ 420 హామీలు ఉండగా అందులో వ్యవసాయ రంగానికి సంబంధించి 31 హామీలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు గడుస్తున్నా ఏ ఒక్క హామీ అమలుకాలేదని మండిపడ్డారు. ఇటీవల కురిసిన వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సోయా పంటను విక్రయించి నెల రోజులు గడుస్తున్నా డబ్బులు అందలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నల్ల చట్టాలను ప్రవేశపెట్టి 720 మంది రైతుల ప్రాణాలు తీసిందన్నారు.





ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌజ్ ఎదుట నిర్వహించిన రైతు దీక్షలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న



నిర్మల్ రైతుదీక్షలో మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

## పోరాటం తీవ్రతరం చేస్తాం



మంచిర్యాలటౌన్, ఏప్రిల్ 6 : కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు ఇచ్చిన హామీలను మరచిపోయింది. పథకాల అమలులో విఫలమైంది. ఇప్పటి దాకా రూ. 2 లక్షల రుణమాఫీ ఇవ్వలేదు. రైతుబంధు అందించకపోవడం దారుణం. రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయినట్లు తెలుస్తున్నది. ఎకరానికి రూ. 25 వేల చొప్పున పరిహారం అందించాలి. 200 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. వారి కుటుంబాలను ఆదుకోవాలి. ప్రభుత్వం దిగిరాకుంటే రైతుల పక్షాన పోరాటం తీవ్రతరం చేస్తాం.

**- కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి**

## రైతులు కన్నీళ్లు పెట్టుకుంటే క్రికెట్ చూస్తారా?



మంచిర్యాలటౌన్, ఏప్రిల్ 6 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పదేళ్లు రైతుల పక్షాన పాలన సాగించారు. చెరువుల్లో పూడిక తీశారు. ప్రాజెక్టులు కట్టించారు. తెలంగాణలో 40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే పండేది. కానీ కేసీఆర్ మూడున్నర కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించే స్థాయికి రాష్ట్రాన్ని తీసుకెళ్లారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే రైతులను పొట్టగొట్టే దుర్మార్గపు చర్యలు చేపట్టింది. రూ. 2 లక్షల రుణ మాఫీ చేస్తామన్నరు. 24 గంటల కరెంటిస్తమని చెప్పారు. రైతు భరోసా కింద రూ. 15 వేలు అందిస్తామన్నరు. ఇందులో ఏ ఒక్కటీ నెరవేర్చింది లేదు. పంటలు ఎండిపోయి రైతులు కన్నీళ్లు పెట్టుకుంటుంటే సీఎం రేవంత్ మాత్రం క్రికెట్ చూస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. ఇలాంటి ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలి.

**- బాల్క సుమన్, మాజీ విప్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు**

## హామీలు అమలయ్యే దాకా పోరాటం



ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 6 : కాంగ్రెస్ సర్కారు రైతులకిచ్చిన హామీలు అమలయ్యే దాకా పోరాటం చేస్తాం. నాలుగు నెలల పాలనలో 200 మంది చనిపోయారు. వారి కుటుంబాలకు రూ. 20 లక్షల చొప్పున పరిహారం ఇచ్చి ఆదుకోవాలి. నీళ్లివ్వక పంట చేతికొచ్చే దశలో ఎండిపోయాయి. ఎకరాకు రూ. 25 వేల చొప్పున పరిహారం ఇవ్వాలి. ధాన్యంపై క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలి. హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్ మళ్లీ మ్యానిఫెస్టోతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్నది. ప్రజలు తగిన గుణపాఠం చెప్పే రోజు దగ్గరలోనే ఉంది.

**- కోవలక్ష్మి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే**



ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రంలో మాట్లాడుతున్న జాన్సన్ నాయక్

మంచిర్యాల(ప్రతినిధి)/ఆదిలాబాద్/నిర్మల్, ఏప్రిల్ 6(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్యంతో సాగునీరు అందక పంటలు ఎండిపోయాయి. రాష్ట్రవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో కరవు చాయలు అలముకున్నాయి. కానీ.. రైతుల కష్టాన్ని కాంగ్రెస్ సర్కారు పట్టించుకోవడం లేదు. కనీసం అయ్యో పాపం అన్న నాథుడే లేకుండా పోయాడు. స్వరాష్ట్రంలో తొలి పదేళ్ల పాలనలో పచ్చబడ్డ పొలాలు ఇప్పుడు నీరు లేక ఎండిపోతున్న దృశ్యాలను చూసి, రైతన్నల ఆవేదనను పట్టించుకోని ప్రభుత్వాన్ని నిలదీసేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్వయంగా రైతుల దగ్గరకు కదిలి వెళ్తున్నారు. పంటలు ఎండిపోయిన ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. రైతుల కష్టాలు తెలుసుకుని బీఆర్ఎస్ పార్టీ ఉందంటూ ధైర్యం చెప్తున్నారు. ఈ క్రమంలోనే రైతులను ఆదుకోవాలని కాంగ్రెస్‌పై ఒత్తిడి తెస్తున్నారు. సాగునీరు లేక ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టినట్లు యాసంగి వడ్లకు కనీస మద్దతు ధరతోపాటు రూ. 500 బోనస్ ఇవ్వాలని పోరాటాలు చేస్తున్నారు. కేసీఆర్ పిలుపు మేరకు ఈ రెండు డిమాండ్లతో ఈ నెల 2వ తేదీన అన్ని జిల్లాల కలెక్టర్లను కలిసి వినతిపత్రాలు ఇచ్చిన బీఆర్ఎస్ నాయకులు.. శనివారం రాష్ట్రవ్యాప్తంగా రైతు దీక్షలు నిర్వహించి నిరసనలు తెలిపారు. సాగునీటి నిర్వహణలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగడుతూ రైతులకు అండగా నిలుస్తున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో శనివారం నిర్వహించిన రైతుదీక్షలు గ్రాండ్ సక్సెస్ అయ్యాయి. అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీ అభ్యర్థులు దీక్షల్లో పాల్గొన్నారు. మారుమూల పల్లెల నుంచి నియోజకవర్గకేంద్రాల్లో నిర్వహించిన దీక్షలకు తరలివచ్చిన రైతన్నలు పూర్తి మద్దతు ప్రకటించారు.

### రైతుదీక్ష భగ్నానికి పోలీసులయత్నం

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో నిర్వహించిన రైతు దీక్షలో మాజీ ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావుతోపాటు పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పాల్గొన్నారు. అనంతరం అక్కడి నుంచి చెన్నూర్‌కు వెళ్లిన బాల్క సుమన్, కొప్పుల ఈశ్వర్ పట్టణంలోని ఎమ్మార్వో కార్యాలయం ఎదుట నిర్వహించిన రైతు దీక్షలో మాట్లాడారు. చెన్నూర్‌లో రైతు దీక్ష కోసం ముందస్తు అనుమతి తీసుకున్నప్పటికీ పోలీసులు టెంట్లు తొలిగించి దీక్షను భగ్నం చేసే ప్రయత్నం చేశారు. బాల్క సుమన్ రావడానికి ముందే టెంట్లను తొలగించిన పోలీసులు కాసేపటికి తిరిగి ఏర్పాటు చేయించారు. దీనిపై బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో జరిగిన రైతు దీక్ష కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో నిర్వహించిన రైతు దీక్షలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పాల్గొన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన రైతుదీక్షలో మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో జరిగిన రైతు దీక్షలో ఆదిలాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, భైంసా నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన రైతు దీక్షలో బీఆర్ఎస్ నాయకులు రమాదేవి, విలాస్ గాదేవర్, కిరణ్ కొమ్రేవార్ పాల్గొన్నారు. ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రంలో బీఆర్ఎస్ నాయకుడు జాన్సన్‌నాయక్, బోథ్ రైతు దీక్షలో స్థానిక నాయకులు పాల్గొన్నారు. రైతు సంఘాల నాయకులు, రైతులు దీక్షా శిబిరాలకు వందలాదిగా తరలివచ్చారు.

## బీఆర్ఎస్ అంటేనే రైతు పార్టీ



భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) అంటేనే రైతు పార్టీ అని ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు అన్నారు. శనివారం నిర్మల్‌లోని ఆర్డీవో కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు దీక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 'రైతు బాగుంటేనే దేశం బాగుంటుందనే' నినాదంతో కేసీఆర్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. రైతాంగానికి ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించడమే కాకుండా, రైతుబంధు, రైతుబీమా, ఉచిత కరెంటు అందించిందన్నారు. ఆచరణ సాధ్యం కాని 420 హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్నదన్నారు. రుణమాఫీ, ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని ఇవ్వలేదని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయని కాంగ్రెస్ పార్టీని పార్లమెంటు ఎన్నికల్లో ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.



పెంబి అడవుల్లో వ్యాపించిన మంటలు

# పెంబి అడవుల్లో మంటలు

### సమాచారం అందించినా పట్టని అటవీ శాఖ అధికారులు

పెంబి, ఏప్రిల్ 6: పెంబి గ్రామ శివారులోని అడవుల్లో రాత్రి మంటలు చెలరేగాయి. కిలో మీటర్ల మేర మంటలు వ్యాపించడంతో అడవిలోని వృక్ష సంపదకు నష్టం వాటిల్లింది. చిన్నచిన్న మొక్కలు, నేలకొరిగిన చెట్లు మంటల్లో కాలి బూడిదయ్యాయి. వన్య ప్రాణులకు ఆటంకం కలిగింది. చిన్నచిన్న వన్య ప్రాణులు మంటల్లో కాలిపోయాయి. మంటల విషయం అటవీశాఖ అధికారులకు సమాచారం అందించినా , వారు స్పందించలేదని స్థానికులు మండిపడుతున్నారు. ఎండ కాలం అడవుల్లో మంటలు వ్యాపించకుండా ఫైర్‌లైన్‌తో పాటు ఇతర ముందస్తు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ అధికారులు అలాంటి చర్యలేవి తీసుకోలేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. మండలంలో ప్రతి రోజు ఏదో చోట మంటలు అంటుకుంటున్నాయని. అడవి, వన్య ప్రాణుల సంరక్షణకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# పార్లమెంట్ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 6: మే 13న నిర్వహించే పార్లమెంట్ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ఎస్పీ సురేశ్‌కుమార్, అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఫిబ్రవరి 8 నాటికి 4,55,437 మంది ఓటర్లున్నారని, మొత్తం 676 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు గత అనుభవాల దృష్ట్యా పోలింగ్ సిబ్బందికి ఇబ్బందుల్లేకుండా పోస్టల్ బ్యాలెట్ వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రశాంత ఎన్నికల కోసం పల్లెల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, మండలాల్లో సీఆర్‌పీఎఫ్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎండలు ముదిరిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉపాధి పనుల వద్ద తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీతో పాటు నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ తాగు నీరందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఎక్కడైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

### ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన

ప్రభుత్వ ఆదేశాల మేరకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు శ్రీదేవితో కలిసి పాఠశాలల్లో వసతుల కల్పనపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 685 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, వేసవి సెలవులు ముగిసి వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పన బాధ్యతలను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విధుల్లో చేరిన 40 మంది స్పెషల్ అసిస్టెంట్లు

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 6 : నిర్మల్ పట్టణంలోని సెయింట్ థామస్ పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి మూల్యాంకన విధులకు 62 మంది స్పెషల్ అసిస్టెంట్లు విధులకు గైర్హాజరయ్యారు. దీంతో శుక్రవారం డీఈవో రవీందర్‌రెడ్డి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న స్పెషల్ అసిస్టెంట్లు శనివారం 40 మంది విధుల్లో చేరారు. మిగతా 22 మంది నోటీసులకు బదులు ఇచ్చారు.

# నిబంధనలు పాటించని ప్రైవేట్ హాస్పిటల్స్‌పై కొరడా

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 6 : జిల్లాలో నిబంధనలు పాటించని ప్రైవేట్ హాస్పిటల్స్‌పై టీఎస్ఎంసీ(తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్) బృందం కొరడా ఝుళిపిస్తున్నది. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జన్మభూమి నగర్‌లోని చంద్ర మల్టీ స్పెషాలిటీ అండ్ క్రిటికల్ కేర్, లోటస్, అమృత హాస్పిటల్స్‌లలో బృందం సభ్యులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. మంచిర్యాల జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా 12 దవాఖానలు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు అందినట్లు టీఎస్ఎంసీ మెంబర్, లీగల్ అండ్ ఆంటీ క్రాకర్ కమిటీ మెంబర్ డాక్టర్ యెగ్గెన శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు జిల్లాలోని వివిధ శాఖల నుంచి ఐదుగురు అధికారులు బృందంగా ఏర్పడి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హాస్పిటల్స్ నిర్వహణపై నివేదికలు తయారు చేసి పై అధికారులకు అందిస్తామని, వారి ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. టీఎస్ఎంసీ కో ఆప్షన్ మెంబర్ డా.సంతోష్, మెడికల్ అధికారి డా.అశోక్‌కుమార్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ చందన, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



ఆసుపత్రిలో తనిఖీలు చేస్తున్న టీఎస్ఎంసీ బృందం సభ్యులు

# ప్రతిభ ఉంటే ఆటంకమే లేదు..



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ వెంకటరమణ

బాసర, ఏప్రిల్ 6 : ప్రతిభ ఉన్నవారికి ఆటంకాలు ఉండవని, అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయని, బాసర ట్రిపుల్‌ఐటీ వీసీ వెంకటరమణ సూచించారు. యూనైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ, బెటీయన్ ఫెలోషిప్, సీమన్ స్కాలర్‌షిప్ పొందిన బాసర ట్రిపుల్‌ఐటీలోని విద్యార్థులను వీసీ వెంకటరమణ శనివారం అభినందించారు. పలు సంస్థల నుంచి ఆర్జీయూకేటీ విద్యార్థులు ప్రతిభ ఆధారంగా ఉపకార వేతనాలు అందుకోవడం ఎంతో సంతోషకరమని తెలిపారు. ప్రధానంగా సైన్స్ టెక్నాలజీ ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్ రంగాల్లో విద్యార్థినులను ప్రోత్సహించేందుకు సెంటర్ ఫర్ సివిల్ సొసైటీ సహకారంతో ప్రత్యేకమైన స్కాలర్‌షిప్ లభిస్తుందని తెలిపారు. 2023-24 ద్వారా 39 మంది విద్యార్థులకు రూ.40వేలు చొప్పున ఫెలోషిప్, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న32 మందికి రూ. 4.80 లక్షల స్కా లర్‌షిప్ పొందారని తెలిపారు. స్పెషల్ ఆఫీసర్ సృజన, అసోసియేట్ డీన్స్ డా. పావని, డా. చంద్రశేఖర్, మహేశ్, స్కాలర్‌షిప్ సెక్షన్ ఫ్యాకల్టీ ఇన్‌చార్జి డా. ఎస్ విఠల్, ప్లేస్‌మెంట్ అండ్ ట్రైనింగ్ అధికారులు నరేందర్, సృజన ఉన్నారు.

# ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

### ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 6: ప్రతి ఒక్కరూ తమ పేరును ఓటరుగా నమోదు చేయించుకోవాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా అన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి జడ్పీ సమావేశ మందిరం వరకు కాగడాను వెలిగించి ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీ సమావేశ మందిరంలో ఓటర్ అవగాహనపై కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ వరకు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఏప్రిల్ 1వ తేదీ వరకు 18 ఏండ్లు నిండిన యువతీయువకులు ఫారం నం-6 నింపి సంబంధిత బూత్ లెవెల్ అధికారులకు అందజేయాలని కోరారు. ఆన్‌లైన్ దరఖాస్తు యాప్‌లో తమ ఆధార్ కార్డు , ఎస్ఎస్‌సీ మార్క్ మెమో ఆధారంగా నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో పాల్గొన్న వారితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఖమర్ అహ్మద్, అంగన్‌వాడీలు, క్రీడాకారులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా